

"అలిమేలు తన జీవితాన్ని తన చేతుల్తోనే కూల్చేసుకుందమ్మా. నువ్వు చదువుకున్నదానివి. నీకు తెలుసు, నలభయ్యేళ్ళు కాపురం చేశాక, దాన్నిలా వొదులుకోవలసి వస్తుందంటే నా క్షోభ ఎలా వుంటుంది?! ఏం చేస్తాం, దాని ఖర్మ..." ఇక ఆ ఉత్తరం చదవాలనిపించలేదు. నాన్న నాకు రాసిన చివరి ఉత్తరం అది. ఆయన పోయారన్న వార్త చెవినబడ్డాక ఆ ఉత్తరాన్ని వందన్నొకటోసారి చదివాను. ఎన్నిసార్లు చదివినా ఆ నాలుగు మాటలకు మించి మరో అక్షరమ్ముక్క ముందుకు వెళ్ళలేకపోతున్నాను. అక్కడే ఆగిపోతున్నాను. పోయేవరకు నాన్న అలిమేలు మీద జాలిపడుతూనే వున్నాడు. బాగా జీడిపప్పు పెట్టి పెంచిన నాటు కోడిని జాతర్నాటికి కోసి వండుకున్నప్పుడల్లా "ప్చ్... ఈ జాతి కోడి మళ్ళీ దొరకదమ్మా" అంటూ జాలిపడ్డం నాన్న కలవాటు. నాన్న చాలా విషయాలలో ఇలాగే జాలిపడుతుంటాడు. అలిమేలు విషయంలో కూడా ఇలాగే జాలిపడ్డాడు. ఎందుకో హఠాత్తుగా అలిమేలును తలచుకుంటే నాక్కూడా జాలేస్తుంది. ఒక్కసారి తుళ్ళిపడ్డాను. అలిమేలు మీద జాలా? నాకు సంబంధించినంతవరకు అది మహా పాతకి. దానివల్లే నేను తల్లికి దూరమయ్యాను. నా తల్లిని పొట్టన బెట్టుకున్న వంచకి అలిమేలు. అలిమేలు మా ఇంటి పనిమనిషి. అవును అలా 'పనిమనిషి' అంటూ తక్కువగా, దానిస్థానమేమిటో దానికి తెలియాలంటే దానిబతుకేవిటో

# అలివేలు

**పసుపులేటి గీత**

దానికి గుర్తుచేయాలంటే, 'పనిమనిషి' అనే అనాలి. మనుషుల్ని కించపరిచేందుకు, వాళ్ళ స్థాయిని దించి చెప్పడానికి మధ్యతరగతి జనం వాడే పదం 'పనిమనిషి', ఆ పదాన్ని వాడాలంటే నాకు పరమ అసహ్యం. అయినా అలిమేలును పనిమనిషనే అంటాను.

***

మా వంశంలో అటేడు తరాల్లోనూ, ఇటేడు తరాల్లోనూ నాన్నే చదువుకొన్న వ్యక్తిగా పరిగణింపబడతాడు. హైస్కూలు రోజుల్లోనే నాన్న 'గాంధీజీ' ప్రభావంతో పదో క్లాసుతో చదువాపేసి స్వాతంత్ర్య సమరంలో అడుగుపెట్టాడు. అప్పట్నుంచి ఆయన చాలా చదువుకున్నాడు. జైళ్ళని చదువుకున్నాడు, లాఠీల్ని చదువుకున్నాడు, ఉద్యమాల్ని చదువుకున్నాడు, అటు తరువాత మార్క్స్‌ని చదువుకున్నాడు, లెనిన్‌ని, స్టాలిన్‌ని చదువుకున్నాడు. మానవతావాదాన్ని చదువుకున్నానని నాన్నే అంటూంటారు. అలాంటి నాన్నకు మా అమ్మతో పెళ్ళయింది. అమ్మ తహసీల్దారుగారి అమ్మాయి. పుట్టి పెరిగిన వాతావరణం అమ్మకి నిలబడి పాలు తాగడం నేర్పింది. కానీ పరుగెత్తి నీళ్ళు తాగే నాన్నతో ఆమె ఇమడలేకపోయింది. భర్త నెల జీతం తెచ్చి చేతిలో పోస్తే ఇంటి కోడలిగా సంసారాన్ని నెట్టుకువచ్చే సగటు ఆలోచనల అమ్మకు నాన్న అర్థంకాలేదు. వొంచిన్నడుం ఎత్తకుండా పొలాల్లో, ఫ్యాక్టరీల్లో మగాడితో సమానంగా పనిచేసి, వచ్చిన కూలి డబ్బుల్తో మొగుణ్ణీ, పిల్లల్ని మహరాజుల్లా చూసుకునే ఆడదాని గురించీ, శ్రామిక మహిళ గురించి ఊహించుకునే నాన్నకు అమ్మ అర్థం కాలేదు. అలా అర్థంకాని అమ్మను నాన్న కొట్టేవాడు. వైవాహిక జీవితంలో అసంతృప్తిని చల్లార్చుకునేందుకు నాన్నకు అలిమేలు ఆలంబన అయింది. అలాంటి ఆలంబన గురించి ఆలోచించే నైతిక హక్కు లేని అమ్మ తన సవతితో కలసి ఒకే కప్పు కింద బతకలేకపోయింది. సంవత్సరం నిండని నన్ను ఊయల కప్పజెప్పి అమ్మ ఆత్మహత్య చేసుకుంది. నన్ను నాయనమ్మే పెంచింది. అయినా అమ్మలేని లోటు లోటుగానే వుండిపోయింది. దాన్ని తీర్చడానికి అలిమేలు ససేమిరా అన్నది. అమ్మ పోయినప్పట్నుంచి అలిమేలు అనే సున్నపక్కన నాన్న అనే ఒకటి స్థిరపడ్డంతో దాని స్థానం 'పది'లపడ్డది.

అలిమేలుది విస్సుకులం. మొలకు కాగితం అడ్డుపెట్టుకుని చీర ఉతుక్కుని ఆరేసుకుని, ఆ తరువాత కట్టుకునేది. దాని తల్లీ దండ్రీ రోజు కూలీకెళ్ళేవారు. ఆరుగురు ఆడ సంతానం. అలిమేలు ఐదోది. అక్కచెల్లెళ్ళందరూ పాచి పని చేసుకుబతికేవారు. తండ్రి తాగొచ్చి తన్ని వున్నది కాస్తా లాక్కెళ్ళేవాడు. అలాంటి జీవితం నుంచి విముక్తి కోసం అలి మేలు కలలుకన్నది. మా ఇంట్లో పనిమనిషిగా చేరింతరువాత అలిమేలు నాన్నకు దగ్గరైంది. అమ్మ పోయిన తరువాత అలిమేలును 'అమ్మా' అని పిలవాలని నా కెవరూ నేర్పలేదు. నాయనమ్మ దాన్ని 'అలిమేలు' అనే పిలవాలని చెప్పింది. వయసుతోపాటు 'అలిమేలు అంటే ఎవరు?' అనే జ్ఞానం కూడా నాకు పెరిగింది. దాంతో దాన్నొక మనిషిగా కూడా తలచుకోవాలంటేనే అసహ్యం వేసేది. ఇంటెడు చాకిరీ అలిమేలు ఒంటిచేత్తో చేసేది. నన్ను మాత్రం నాన్న ఇష్టంగానే చూసుకునేవాడు. నా విషయంలో అలిమేలు భయభక్తులతో ప్రవర్తించేది. ఆ భయభక్తుల వెనుక నాన్నున్నాడు. అప్పట్లో ఇది నాకు సరైందే ననిపించేది. తన పక్కన అలిమేలు స్థానమేమిటన్నది ఆయనెప్పుడూ చెప్పలేదు. తాను ఆయనకు రెండవ భార్యనని అలిమేలు అనుకునేది. దాని భ్రమలు బద్దలైన సంఘటనొకటి జరిగింది.

***

ఆ మధ్య సెలవులకు ఒకసారి ఇంటికి వెళ్ళాను. ఇంటి పక్కన ఖాళీ స్థలంలో నాన్న మరో డాబా కడుతున్నాడు. నాన్నకు 'వంశ నామం' మీద పెద్ద మోజు. తన వంశం తనతో అంతమైపోతుందనీ, తనకు మగ సంతానం ఇవ్వలేని అమ్మ మీద [ఆమె చనిపోయిం తర్వాత కూడా] అస్తమానమూ విరుచుకుపడేవాడు. నాన్నకో తమ్ముడున్నాడు. ఆయనకు ముగ్గురు మగపిల్లలు. తమ తరం తరువాత వంశనామాన్ని ముందుకు తీసుకెళ్ళే వాళ్ళ మీద నాన్నకి చాలా ఇష్టం వుండేది. నాకు పెళ్ళిచేసి పంపేసిన తరువాత వాళ్ళలో ఒకడిని నాన్న దత్తత తీసుకున్నాడు. ఇక అప్పట్నుంచీ ఆ పిల్లవాడి భవిష్యత్తు కోసం ఆస్తులు కూడబెట్టే ప్రయత్నంలో మునిగిపోయాడు. నాన్న మారి

## ఆహారం!

జవహర్‌లాల్ నెహ్రూ స్వాతంత్ర్య సమరంలో పాల్గొని అనేకసార్లు జైళ్ళకు వెళ్ళారు. ఆ జైళ్ళలోని ఒక జైల్లో ఆహారం చాలా ఘోరంగా ఉండేది. అన్నంలో చాలా హెచ్చు సంఖ్యలో రాళ్ళు వచ్చేవి. కొంతకాలం ఓపిక పట్టిన తరువాత నెహ్రూజీ ఈ విషయాన్ని జైలర్‌కు చెప్పారు.

'స్వాతంత్ర్య సమరయోధుడికి ఆహారం విషయంలో పట్టింపు ఉండదు గదా! మీ మాతృభూమిని మీరు ఎంతో ప్రేమిస్తూ ఉండడం వలన జైలు పాలయ్యారు. ఈ పరిస్థితిలో తిండి గురించి ఆక్షేపణ చెయ్యకూడదు' అన్నాడు వ్యంగ్యంగా జైలర్.


'నిజమే. నేను మాతృభూమిని ప్రేమిస్తున్నా! అయితే ఈ భూమిలో వుండే రాళ్ళనూ, మట్టినీ తినడానికి కాదు గదా, నేనిక్కడ వుంది' అని అంటించారు పండిట్‌జీ.



— కొడిమెల


# పట్టాలు దాటిన పజ్జెం






తాత తండ్రుల జన్యువులకి ఆకారమిచ్చి వెట్టిచాకిరీ చేయడమేనా జీవితం?
ఆజ్ఞల్ని జారీచేసే మెదడు కిరీటం అంగాల సిగ్నల్స్‌ని అందుకుంటుందా? యిది నిర్దేహం కృతక సమన్వయాల
పుట్ట టెస్ట్‌ట్యూబ్ సిద్ధాంతాలకి శాస్త్రోక్తంగా పుట్టిన గాడిద పిల్ల కళ్లజోడు పెట్టుకున్న కబోది యిది బోనసాయ్ మంట
బలే పరేషాన్ చేస్తోంది రోగం పాదరసంలా. రోగనిదానం చేయనివాడు-డాక్టరా యాక్టరా సందర్భానుసారం
ప్రోగ్రాంలు ఎన్ని గ్రాముల లౌక్యం యెన్ని కిలోల నటన యెంత వాస్తవం పరదా కూడా పారదర్శకమే ఖబడ్దార్
సమాధానాలకి ప్రశ్నలకి దోసిలిపట్టే బాపణ్ణి కాదు సాయిబుని కాకపోయినా. పీఠాలు కదిలిపోయే పిచ్చి కేకలు
కావాలి ప్రబోధాల మధ్య ఖాళీల్లోంచి పిచ్చోడు తప్పించుకుపోయాడు మీ స్వస్థతకే సవాల్
మేప్‌లో యిరుక్కున్న వాడు మేప్‌లోనే వుంటాడు దారి తప్పిన వాడు అద్భుత ద్వీపాన్ని కనుగొంటాడు డప్పులతో
చెలిమి వల్ల తోలు వలచి వులికి ఆరేసుకుంటా నిప్పులమీద యిదో తరహా ఆత్మవిమర్శ పరవిమర్శ అని భుజాలు
తడుముకుంటే వాషింగ్ పౌడర్ ప్రకటన అంటా యే తంటా లేకుండా.

—రాణి శివశంకర్




పోయేడు. 'స్వంత – ఆస్తి' అనే ఆలోచనే సాంఘిక నేరంగా పరిగణించే ఒక కమ్యూనిస్టు ఆస్తుల సంపాదనలో పడ్డాడు. ఆ సంపాదనలో భాగంగానే కొత్తగా డాబా కట్టడం. ఇంటి వెనుక పచ్చడిబండ వుంది. ఒక రోజు అలిమేలు పచ్చడి నూరుతూ వుంది. నాన్న, ఆయన దత్త కుమారుడు అందరూ పని మీద బయటికి వెళ్ళిపోయారు. నేను నా కొడుకును ఊయలలో వేసి ఊపుతున్నాను. చక్రాల్లాంటి కళ్ళేసుకుని వాడు నన్ను చూస్తూ, ఊయలలో ఆడు కుంటున్నాడేగానీ ఎంతకీ నిద్రపోవడం లేదు. అలిమేలు పచ్చడిబండ చప్పుడు లయబద్ధంగా వినపడుతోంది. దాని గాజుల సవ్వడి కూడా. ఇంతలో గాజులు మౌనం వహించాయి. ఎవరో వచ్చిన అలికిడి "అలిమేలూ కాస్త కరివేపా కుంటే నాలుగు రెమ్మలిస్తావా... హు, ఏవిటే నూరుతున్నావ్, మసాలానా... అహ అయితే ఈ పూట మీ ఇంట్లో వంటకాలు బలంగా వుంటాయన్నమాట..." సుబ్బాయమ్మ గొంతు వినిపించింది. "అవునక్కా, ఇయ్యాళ మాంసం తెచ్చినాడు నీ మరిది. మునక్కాయలేసి పులుసు పెడతాండ. మద్దాన్నానికి నువు గూడా రా తిందువు..." అంటోంది అలిమేలు నవ్వుతూ.

"హు... ఏవిటోనే అలివేలు! నువ్వీ ఇంటి కొచ్చినప్పట్నుంచీ చూస్తూనే వున్నా. ఎలా వొచ్చిందానివి అలాగే వున్నావ్. "

"ఏందక్కా, అట్టంటండా, నాకేటి తక్కు వైంది..."

"అసలేముందే పిచ్చిదానా, ఎన్నేళ్ళు ఈ ఇంటికి చాకిరీ చేసినా నిన్ను లేచొచ్చిన దానివనే అంటారుగానీ, పెళ్ళానివంటారా? నీ మెళ్ళో

ఆ ముసల్ది పసుపుతాడు కట్టిందికానీ, దాని కొడుకేమన్నా కట్టాడా?!..."

"అక్కా, ఆ మాదిరిగా అనబాక..."

"అలా అనడానికి నాకేమన్నా సరదానా. నీ బాగు కోసమే. కాస్త కళ్ళు తెరిచి ఆలోచించు. మీ ఆ యన్ని నీ పేరిట ఏమన్నా రాయమను. ఆయన లక్షణంగా వున్నప్పుడే నీ బతుక్కోదారి చూసుకో. ఆయన కూతురేమో ఒక అయ్య యింటికి వెళ్ళిపోయిందాయె. దత్తు తెచ్చుకున్నవాడు రేపు నిన్ను చూస్తాడని గ్యారంటీ ఏమిటిట? అందుకే నా మాట విని, కొత్తగా కడుతున్న ఈ డాబాను నీ పేరిట రాయమను" సుబ్బాయమ్మ గొంతు గుసగుసగా పలుకుతోంది. అలిమేలు గాజుల సవ్వడిలో ఏదో మంద్రత వినిపిస్తోంది. కాసేపటి తరువాత సుబ్బాయమ్మ వెళ్ళిపోయింది. ఈ సంభాషంతా నా చెవినబడిన విషయం ఎవరికీ తెలియదు. అలిమేలుకు ఆస్తి హక్కా, పచ్చటి కాపురంలో చిచ్చుపెట్టిన అలిమేలుకు ఇంకా ఏమివ్వాలి? ఎందుకివ్వాలి? మనసు ఆక్రోశిస్తున్నది. అయినా ఏమూలో విచక్షణ నా గొంతు కడ్డం పడ్డది. నాకు సంబంధించని గొడవ అనుకుని అంతా మరచిపోయాను. దాని ఫలితం రెండు రోజుల తరువాత కనిపించింది. అలిమేలు ఇల్లు విడిచి వెళ్లిపోయింది. ఆ రోజు నాన్నకు గుండె నొప్పి వచ్చింది. మైల్డ్ హార్ట్ ఎటాక్ అన్నారు. తన అక్క ఇంటికి చేరిన అలిమేలును వెదుక్కుంటూ నాన్న వెళ్ళారు. అలిమేలు నాన్నని పలకరించింది, మాట్లాడింది. కానీ దాన్ని ఇంటికిమాత్రం తీసుకురాలేకపోయాడు నాన్న. ఆయన కృంగిపోయాడు. "ఇలా చేస్తుందనుకోలేదమ్మా. ఈ వయసులో దానికిదేం పాడుబుద్ధి. ఇలా ఆస్తి కోసం వెంపర్లాడుతుందని అప్పుడే తెలిస్తే దీన్ని ఈ ఛాయల్లో మెదలనిచ్చేవాడినా! అయినా దానికి ఇప్పుడేం తక్కువ చేశానని. చచ్చేదాకా దానికి కావలసింది కాస్తంత కూడూ, గుడ్డా. అవి నా బిడ్డలు దానికి ఇవ్వకుండాపోతారా, అదేమైనా బొట్టుగట్టిన పెళ్ళామా? నేనింతకాలం మానవతా దృక్పథంతో దానికి ఇంట్లో స్థానమిచ్చి, పెళ్ళాంలా చెలామణి చేశాను. కానీ ఇప్పుడది చట్టప్రకారంగా ఈ వయసులో నేను తనను పెళ్ళి చేసుకోవాలంటున్నది. ఇది జరిగే పనేనా? ఇదేం పెద్ద అందగత్తెనా? డబ్బున్నదా? చదువున్నదా? దీన్నిపుడు పెళ్ళిచేసుకుంటే, పెళ్ళామై నా సగం ఆస్తిని అప్పణంగా కొట్టేసి దాని అక్క బిడ్డలకి ఇచ్చేస్తుంది. ఎవడో ముక్కూ మొహంతెలియని వాడికోసమా ఆస్తి కూడబెట్టేది. వీల్లేదు. అది నా పెళ్ళాంకాదు. అది నా లంజ అంతే. అలా అని ఖరాఖండిగా దాన్తోనే చెప్పేశాను. వస్తేరాని పోతే పోనీ..." అన్నాడు నాన్న నాతో.

"నాన్నా! 'నువ్వు నాకు లంజవి' అనే మాట దాన్తోనే చెప్పేశావా?"

"అవును"

ఇక నాకింకేం వినబడలేదు.

యాభయ్యేళ్ళు ఒక మగవాడితో కలిసి వున్న ఆడదాన్ని సజీవంగా దహనం చేయడానికి ఆ ఒక్క మాట చాలనిపించింది.

***


ఇంటికి వెళ్ళగానే నాన్న పూల మధ్య విశ్రాంతగా నిద్రపోతున్న దృశ్యం కనిపించింది. ఉప్పెనలా దుఃఖం పొంగుకొచ్చింది. ఆయన మీద నన్నిలా వొణికించేంత ప్రేమ నాలో వున్నదని నేనేనాడూ ఊహించలేదు. అయినా ఏడ్చాను, ఏడ్చాను. అలిమేలు ఒక మూల కూర్చుని వుంది. అది వొచ్చేసింది, కానీ ఆవందించడానికి నాన్న లేరు. అప్పట్నుంచీ అలిమేలు ఇంట్లో ఒక మూల కూర్చునే కాలం గడుపుతోంది. దాని పసుపుకుంకాలు తీయాలని నాయనమ్మ పట్టుబట్టింది. ఆ రోజు రానే వచ్చింది. ఎంతమంది కలిసినా దాన్ని పట్టుకోలేకపోయారు. అలిమేలు ఎదురుతిరిగింది. "నేనెందుకు పసుపుకుంకాలు తియ్యాల. నేనేమన్నా పెళ్ళాన్నా. లంజను. లంజకి ముండమోపితనం లేదు" ఆడపులిలా అలిమేలు గాండ్రించింది. సూతకం గడిచింది. నేను మా వూరు బయల్దేరాలి. మరునాడు పొద్దుటే హడావిడీగా అంతా సర్దుకుంటున్నాను. ఇంతలో ఇంటి బయట ఏదో అలజడి. పరుగున వాకిట్లోకి వెళ్ళా. ఇంటికెదురుగా షామియానా.... పదీపదిహేను మంది యానాది స్త్రీలు, మగవాళ్ళు. మధ్యలో అలిమేలు కూర్చునివుంది. షామియానా అంతా ప్లకార్డులు. "దళిత మహిళకు న్యాయం చేయండి" ఇంట్లోంచి నాన్న తమ్ముడూ, ఆయన కొడుకులూ బయటకు వచ్చారు. కర్రలు గాల్లోకి లేచాయి. నాన్న ఫోటోకు వున్న పూలమాలను నేను 'అలిమేలు' కొప్పులో పెట్టాను. "అమ్మా, నేమారెళ్తున్నాను" నాకు తెలీకుండానే అప్రయత్నంగా అలిమేలుతో ఆ మాటన్నాను. ●

# రక్తం చేసుకో

నా పురిటి కంట్లో అక్షరమ్మీద
ఎర్రని, నల్లని తొడుగుల నీడ
కనురెప్పల్లో పాటని
కరిపెట్టే సిరుల్ని చీలుస్తుంది

ఉపన్యాసాల్లో లేచిన
ఉంగరాల వేళ్ళు
తెంచగలవా, నుదుళ్ళ సంకెళ్ళని?
కాగలడా, ప్రవాహకుడు
రక్తమద్దుకున్నోడు?

హైందవ చీమెక్కినోడా
నీ కీర్తి కీలల్లో
అశ్రుపేగునే కాలుస్తున్నావు



ఆధిపత్యాలకు బానిసైనోడా
విగ్రహంలా నా గుండె లెక్కుతున్నావు
నెత్తురూ, నొప్పీ, చచ్చినోడా
కులాన్ని, జపమాలని జేస్తున్నావు
వ్యాపార తాత్వికుడివై
వేదాల్లా వెనక్కి నడుస్తున్న
బ్యాలెట్ జంతువా!

అవమానాల్ని తుడిచిన
అమ్మ కొంగులో
కన్నీళ్ళ మరకలెతుక్కో
స్తన్యమందని తరాల్లో కెళ్ళి
గాయం చూసుకో
నిన్ను నువ్వు రక్తం చేసుకో
(దళితుల్లో దళారులకి...)

– ఎ. దుర్గాప్రసాద్